క్లుప్తంగా

పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు
మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఆమె వెంట 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

వేగవంతంగా కుల గణన సర్వే



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వేను అధికారులు వేగవంతం చేశారు. బుధవారం తెనాలి పట్టణంలో అన్ని వార్డులలో దీనిని నిర్వహించారు. వార్డు వలంటీర్‌లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వారి కులాల వివరాలు నమోదు చేసి ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి



మృతుడి బ్యాగులో ఉన్న ఫొటో

తెనాలిరూరల్: తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. భక్తులు గమనించి 108కు సమాచారం అందించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి వైకుంఠపుర దేవస్థాన ఆవరణలో సుమారు 50–55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన భక్తులు, ఆలయ సిబ్బంది 108కు సమాచారం అందించగా తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పొద్దుపోయాక మృతి చెందాడు. వైద్యశాల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఉన్న బ్యాగులో చిన్నారితో కూర్చున్న మహిళ ఫొటో ఉంది. వివరాలు తెలిసిన వారు 9440796218 నంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.

బాలికా హక్కులను పరిరక్షణకు కృషి చేయాలి
తెనాలిటౌన్: ఆడపిల్లల హక్కులను పరిరక్షించుటకు అందరూ కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ తెలిపారు. పట్టణంలోని జీఎంజీ మహిళా కాలేజ్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గృహవిజ్ఞానశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. అనంతరం జరిగిన సభలో సౌజన్యశ్రీ ఆడపిల్లలు ఎదుర్కొనే సామాజిక సమస్యలు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. గృహవిజ్ఞాన విభాగ అధిపతి డాక్టర్ పాటిబండ్ల హేమలత మాట్లాడుతూ లింగ వివక్ష, సమానత్వం, ఆడపిల్లల పరిరక్షణ, హక్కులు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద, కరస్పాండెంట్ సిస్టర్ ట్రీజీ, నవీన, విద్యార్థినులు పాల్గొన్నారు.

హాఫ్‌పేటలో పోస్టర్ ఆవిష్కరణ..
రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో బాలికా దినోత్సవ వేడుకలను చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలికలను రక్షించుకుందాం–వారి హక్కులను కాపాడుదాం అనే పోస్టర్‌ను ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, క్రాఫ్ కోఆర్డినేటర్ వెంకయ్యలు ఆవిష్కరించారు. బాలికలందరూ బడిలో ఉండేలా చూడాలని, బాలికలపై జరుగుతున్న వివక్ష, వేధింపులను అరికట్టాలని, బాలికల హక్కులు, రక్షణ కోసం అందరూ పనిచేయాలని వెంకయ్య కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అనూష, గాయత్రి, వార్డు సభ్యులు రుద్రపాటి అనిల్, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

- నేటికీ ప్రారంభానికి నోచుకోని 52 పనులు
- ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు

తెనాలిఅర్బన్: అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా తెనాలి మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ అధికారుల తీరు తయారయ్యింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వార్డులలో మౌలిక వసతుల కల్పనకు సుమారు ఏడాది క్రితం విడుదలయిన నిధులను ఉపయోగించడంలో వారు విఫలం అవుతున్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు పనులు పూర్తి చేయించండని కౌన్సిల్ సమావేశంలో కోరుతున్న వారిలో మాత్రం చలనం రావటం లేదు.

● తెనాలి పట్టణంలోని 40 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటి వరకు 37 వార్డులలో పూర్తయింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వార్డులలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొని ఆయా శాఖల అధికారులతో నమోదు చేయించారు. ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యలు మురుగు కాల్వలు, సీసీ రోడ్ల ప్రతిపాదనలు ఉన్నతాధికారుల అనుమతికి పంపారు. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు.

నేటికి ప్రారంభం కాని 52 పనులు..
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో ఈ నిధుల ద్వారా పరిష్కరిస్తున్నారు. పట్టణంలో 128 అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.8.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు 63 పనులు పూర్తి చేయగా, ఆరు టెండర్ల దశలో ఉన్నాయి. ఏడు జరుగుతుండగా, ఇంకా 52 పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని బట్టి ఇంజనీరింగ్ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది.



పినపాడు తాడిబోయిన వారి వీధిలో ప్రారంభం కాని రోడ్డు నిర్మాణ పనులు



25వ వార్డు పోతురాజు వారి వీధిలో ప్రారంభం కాని మురుగు కాల్వ పనులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు..
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తుంది. 25, 26 వార్డులలో గత ఏడాది సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. టెండర్లు పూర్తి అయినా నేటికి పనులు ప్రారంభం కాలేదు. పట్టణంలో కొన్ని అభివృద్ధి పనులు సగంలో నిలిపివేయగా, మరికొన్నిటిని ప్రారంభించలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు ఇంజనీంగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులున్న ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిల్ సమావేశంలో వారు ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవటంతో చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్‌ను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు చేయని అధికారులపై చర్యలు తప్పవు..



తెనాలి పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ అభివృద్ధి పనులు కొంత మందగించిన మాట వాస్తవం. గత మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా కౌన్సిలర్‌లు నా దృష్టికి సమస్యలు తెచ్చారు. ఇప్పటికే కాంట్రాక్టర్‌లు, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనులు ప్రారంభించాలని ఆదేశించాం. అలాగే పూర్తయిన బిల్లులు చెల్లించటంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అలాంటి వారిని తీరు మార్చుకోవాలని హెచ్చరించాం. అయినా తీరు మారకపోతే చర్యలు తీసుకుంటాం.

–తాడిబోయిన రాధిక, మున్సిపల్ చైర్‌పర్సన్, తెనాలి

పనులు వేగవంతానికి చర్యలు..



గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు పట్టణంలో పలు మౌలిక వసతుల కల్పనకు ఉపయోగిస్తున్నాం. ఇటీవల వివిధ కారణాల వల్ల పనులలో జాప్యం జరిగిన మాట వాస్తవం. వెంటనే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికి ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించాం. త్వరలో పూర్తి చేయిస్తాం.

– ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి మున్సిపాలిటీ

పారిశుద్ధ్య కార్మికులకు నూనె, సబ్బులు పంపిణీ



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 8,9 పారిశుద్ధ్య డివిజన్‌లలో పనిచేసే కార్మికులకు బుధవారం ప్రభుత్వం పంపిన సబ్బులు, నూనెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణ, అనుపమ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అనేక చర్యలు తీసుకుంటుందని 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం పేర్కొన్నారు. నూతనంగా ప్రభుత్వం జారీ చేసిన వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పలువురు వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పురోగతికి ఆసరా

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- అట్టహాసంగా డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ విడుదల
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- కొల్లిపర మండలంలో 1,246 సంఘాలకు రూ.9,81,81,962 లబ్ధి
- పట్టణ డ్వాక్రా సంఘాలకు రూ.47.87 కోట్లు పంపిణీ
- నాలుగో విడత ఆసరా రూ.11.57 కోట్లు చెక్కు పంపిణీ



డ్వాక్రా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



కొల్లిపరలో నాలుగో విడత రుణమాఫీ సభలో డ్వాక్రా మహిళలు

కొల్లిపర: మహిళా సాధికారత మరింత మెరుగుపడేందుకు, స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి వైఎస్సార్ ఆసరా పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక అవుతురామిరెడ్డి కళాశాలలో మండల స్థాయి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ నిధుల జమ కార్యక్రమ సభ నిర్వహించారు. ఎంపీడీవో వి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ వైఎస్సార్ ఆసరా నమూనా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి మధ్యవర్తులు, ఎక్కడా అవినీతి లేకుండా వైఎస్సార్ ఆసరాతో పాటు అనేక పథకాల నిధులను నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఇలా జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. సీఎం జగన్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో 27వేల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో రూ.8.5 కోట్ల తో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు పూర్తి అయినట్లు మరో 10రోజుల్లో ప్రారంభించి వైద్యశాలలో అన్ని వైద్య సేవలు అందివనున్నట్లు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4వ విడతలో భాగంగా కొల్లిపర మండలంలో 1,246 సంఘాలకు 12,454 మంది మహిళలకు రూ.9,81,81,962, నాలుగు విడతలలో మొత్తం రూ.39.28 కోట్లు అందజేయటం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, మండల పరిషత్‌ఉపాధ్యక్షులు1,2 బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు నాంచారయ్య, ఏపీఎం ప్రియదర్శిని, వివిధ గ్రామ పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు , ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

తెనాలిలో వైఎస్సార్ ఆసరా..
తెనాలి: డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామన్న చంద్రబాబు అయిదేళ్ల కాలంలో మాట నిలుపుకోకపోగా, వాటిని నిర్వీర్యం చేశారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విమర్శించారు. పాదయాత్రలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు దఫాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాఫీ చేశారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో భాగంగా బుధవారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మున్సిపాలిటీ పరిధిలోని 1,498 డ్వాక్రా సంఘాలకు రూ.11.97 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. సభలో మాట్లాడుతూ నాలుగు విడతల్లో పట్టణ డ్వాక్రా సంఘాలకు రూ.47.87 కోట్లను అందజేశామన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తే తద్వారా కుటుంబం, సమాజం బాగుంటాయనేది సీఎం జగన్ ఆశయంగా చెప్పారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు బటన్ నొక్కి అదేపనిగా డబ్బులు వేస్తూ ప్రజల్ని సోమరిపోతుల్ని చేస్తున్నారంటూ విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. స్త్రీ సాధికారత కోసం భవిష్యత్‌లో మరింతగా తోడ్పడేందుకు ముఖ్యమంత్రి జగన్‌ను, తననూ ఆశీర్వదించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రజలకు నిత్యం మంచిని చేస్తున్న ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ సంక్షేమ లబ్ధితో మహిళలు ఆర్థికంగా స్థిరపడినప్పుడే ప్రభుత్వ ఆశయం సిద్ధిస్తుందని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, షేక్ దుబాయ్‌బాబు, గొడవర్తి సాయిహరేరామ్, దాసరి వీరవసంతరావు, యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెదలంక వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, కొమ్ము రాయల్, కాళిదాసు విజయసత్యం, టెక్స్ బాల, కాళిదాసు వెంకటేశ్వరరావు, చుండూరు సాయి, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉదాత్త ఆశయానికి వారసుల వెలుగు

కాకుమాను శంకరుని ధర్మసత్రం నూతన భవన సముదాయం ప్రారంభంలో ఎమ్మెల్యే



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఉదాత్తమైన ఆశయంతో సమాజానికి అంకితం చేసిన ఒక సంస్థను 125 ఏళ్లుగా కొనసాగించటం అద్భుతమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా సేవలను కొనసాగిస్తూ, ఆధునికతను సంతరింపజేయటం ట్రస్టీల నిబద్ధతకు నిదర్శనమన్నారు. పట్టణ బోసురోడ్డులోని కాకుమాను శంకరుని ధర్మసత్రంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. మరో బ్లాకును ఆయన సోదరుడు అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆంధ్రా పారిస్ తెనాలికి సేవారంగంలోనూ ఎంతో ఖ్యాతి ఉందన్నారు. ఎందరో వదాన్యులు పట్టణంలో వివిధ సేవాసంస్థలను స్థాపించి, భూరివిరాళాలను సమకూర్చినట్టు చెప్పారు. అందులో ప్రథముడు కాకుమాను శంకరుడు అన్నారు. బాటసారుల కోసం 1898లో శంకరుడు ధర్మసత్రం ఏర్పాటుచేసి, నిర్వహణకు విలువైన ఆస్తులను సమకూర్చినట్టు చెప్పారు. తర్వాత కాకుమాను రామారావు, తన మిత్రుడు కాకుమాను శరత్‌బాబు, దాత ఆశయాల కనుగుణంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. దేవదాయ, ధర్మాదాయశాఖ నిర్వహణలో గల సత్రానికి ఆధునిక భవన సముదాయం నిర్మించటం అభినందనీయమన్నారు. ధర్మసత్రం ఈవో మండే పూడి పానకాలరావు మాట్లాడుతూ, ధర్మసత్రం పెంకుటిల్లు శిథిలావస్థకు చేరినందున భవన సముదాయం నిర్మించినట్టు చెప్పారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కాకుమాను శరత్‌బాబు మాట్లాడుతూ ధర్మసత్రం భవన సముదాయం కోసం 1966లోనే తన తండ్రి శంకుస్థాపన చేసినా, తన హయాంలో ఎమ్మెల్యే శివకుమార్ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. రాచాబత్తుని బ్రహ్మం , ఉయ్యూరు రాజేంద్రప్రసాద్, సామల లక్ష్మణబాబు, డాక్టర్ కొత్త శివరామకృష్ణప్రసాద్, జాలాది శ్రీనివాస్, సీహెచ్ సతీష్, కె.నరేంద్ర, డీఈఈ జనార్ధనరావు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసులు
తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. గంగానమ్మపేటలో కొత్తపేటకు చెందిన వ్యక్తి ఆరు సీసాలు తీసుకెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. మార్కెట్ ఏరియాలో వన్‌టౌన్ పోలీసులు ఓ వ్యకి వద్ద 20, మరో వ్యక్తి వద్ద 10 సీసాలను స్వాధీనపర్చుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష



సురక్ష మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సురేంద్ర



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు ప్రజలకు ఎంతో మేలుచేస్తున్నాయని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పేర్కొన్నారు. అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆమె, ఒకటో వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్రలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం నిర్వహించే మెడికల్ క్యాంప్‌లను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌లో జనరల్ ఓపీ–86, అప్తమాలజీ–48, గైనిక్–76, జనరల్ మెడిసిన్–72 మందిని పరీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వట్టిప్రోలు మోనిక, డాక్టర్ వి.లిఖిత, డాక్టర్ టి.వినీల్, డాక్టర్ ఉషారాణి, డీపీఎంవో జంగం శ్యామ్, ఆరోగ్యవిస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం మనవడి వేధింపులు
తెనాలిరూరల్: ఆస్తి రాసివ్వాలని అమ్మమ్మను మనవడు, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరపువారు వేధింపులకు గురి చేస్తుండడంపై కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన సుబ్బలక్ష్మిని ఆమె మనవడు విజయభాస్కర్, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరఫు మరో ఐదుగురు ఆస్తి తమకు రాసివ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారు. మద్యం తాగి వచ్చి మనవడు తరచూ వేధింపులకు గురి చేస్తుండడంతో సుబ్బలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన విధానంలో వ్యాయామానికి అంత ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే క్రీడలపై యువత ఎక్కువ శ్రద్ధచూపటం లేదన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అలాగే క్రికెట్ ఆడి ఆటను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నపై హర్షం
తెనాలి: వెనుకబడిన తరగతుల సామాజిక అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించటం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు చేసిన కర్పూరి ఠాకూర్ శతజయంతిని పురస్కరించుకున్న అత్యున్నత గౌరవం కల్పించటాన్ని స్వాగతిస్తున్నట్టు బుధవారం తెనాలిలో చెప్పారు. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని రాజకీయ నేతగా, మంగేరీలాల్ కమిషన్ సిఫార్సు మేరకు ఓబీసీలకు 26 శాతం రిజర్వేషన్ అమలుచేసిన ఘనుడని చెప్పారు. ఓబీసీల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి, 1990లో మండల కమిషన్ సిఫార్సుల అమలుకు దోహదపడిందన్నారు. దేశంలోనే తొలిసారిగా కులగణనను నిర్వహించి, సార్వత్రిక ఎన్నికలకు ముందు సవాల్ విసిరిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసిందని భావిస్తున్నట్టు చెప్పారు. రాజకీయ ఎత్తుగడ అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి స్వచ్ఛందంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పసుపు వేలము ప్రకటన
బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు ఈ దిగువ తెల్పిన రైతులు పసుపును హామీగా వుంచి ఋణము పొందియున్నారు. వారి యొక్క ఋణము వాయిదా మీరినది. వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు ఇచ్చినను ఋణము చెల్లించనందున వారి యొక్క పసుపును ఈ దిగువ ఉదహరించిన విధముగా సహకార సంఘముల చట్టం ప్రకారము వేలము వేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

తే.29-01-2024 ఉదయం 11.00 లకు, దుగ్గిరాల గ్రామము నందు

క్ర. సం.	ఖా.నెం.	రైతు పేరు	బస్తాల సంఖ్య	క్వింటాళ్ళు	సరుకు పేరు	రోజు ఇచ్చిన తేది	అమౌంట్	సరుకు నిల్వ ఉన్న స్థలము
1	7026	కొల్లి వీర ప్రతాప్ శీతారామయ్య [illegible]	513	55	పసుపు	25.01.2018	275000	పెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల
2	569బి	[illegible]	928	170	పసుపు	31.08.2018	800000	సెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల
3	612బి	[illegible]	930	190	పసుపు	01.09.2018	890000	సెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల
4	613బి	[illegible] శివరావు [illegible]	931	124	పసుపు	26.09.2018	570000	సెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల
5	619బి	[illegible] శివరావు [illegible]	945	184	పసుపు	05.10.2018	870000	సెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల
6	613బి	[illegible] శివరావు [illegible]	946	47	పసుపు	05.10.2018	210000	సెంట్రల్ వేర్‌హౌస్, దుగ్గిరాల

షరతులు : 1) పాటలో పాల్గొనదలచిన వారు వేలము సమయమునకు ముందుగా రూ.50000/-లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 2) పాట పాడుతున్న వారు సొమ్ము రూ.500000/- [illegible] చెల్లించి మిగిలిన మొత్తమును సరుకును స్వాధీనపరుచుకున్న రోజున చెల్లించవలెను. 3) పాటను జరుపుటకు మరియు నిలుపుదల చేయుటకు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారికి పూర్తి అధికారము కలదు. 4) పూర్తివివరముల కొరకు సంఘ ఆఫీసు పనివేళల యందు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని [illegible]

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, PACS, భట్టిప్రోలు